

రైతుల ప్రగతికి కృషి

రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రైతుల సంక్షేమానికి, వ్యవసాయ రంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తోందని మంత్రి చెల్లుబోయిన వేణు అన్నారు. 8లో▸




సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సాక్షి దినపత్రిక సంపాదకులు వర్దెల్లి మురళి అన్నారు. 8లో▸

డెల్టాలకు 4,850 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 4,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,400, మధ్య డెల్టాకు 450, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 4.60 అడుగులకు చేరింది.



న్యూస్‌రీల్

23న అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశానికి పరీక్ష



వై.లక్ష్మణకుమార్, ప్రిన్సిపాల్

రామచంద్రపురం రూరల్: కోనసీమ జిల్లాలోని ఆరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 23వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్టు ద్రాక్షారామ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ వై.లక్ష్మణకుమార్ బుధవారం విలేకరులకు తెలిపారు. ప్రవేశ పరీక్షలు 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటలకు, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తారన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్లు ఆన్‌లైన్ ద్వారానే డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. జిల్లాలోని ఆరు అంబేడ్కర్ గురుకులాల్లోనూ పరీక్షా కేంద్రాలు కేటాయించారు. గత ఏడాది వరకు ఏ సెంటర్‌లో అయినా రాసే వెసులుబాటు ఉండేది. కానీ ఈ ఏడాది నుంచి విద్యార్థులు ఏ సెంటర్‌లో అయితే పరీక్ష రాయడానికి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారో ఆ సెంటర్‌లోనే పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. గంట ముందుగా పరీక్షా కేంద్రానికి హాజరు కావాలి.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు

ముమ్మిడివరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమ ఆధారిత శిక్షణ ఉపాధి ప్రోగ్రామ్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోక్‌మాన్ తెలిపారు. తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో పోనాసోనిక్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ట్రైనీలుగా పనిచేయడానికి 2020–22లో ఐటీఐ పాసైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు గల పురుషులు అర్హులన్నారు. ఈ నెల 21న ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని తమ కార్యాలయంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు 95814 22339 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా విజయరావు



సీహెచ్.విజయరావు

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీసు 3వ బెటాలియన్ కమాండెంట్‌గా సీహెచ్.విజయరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నెల్లూరు ఎస్పీగా పని చేస్తున్న విజయరావును కాకినాడలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా నియమించింది. బాధ్యతలు స్వీకరించించేందుకు రమణయ్యపేటలోని బెటాలియన్ కార్యాలయానికి వచ్చిన ఆయనకు అడిషనల్ కమాండెంట్ భద్రయ్య, డీసీపీ అర్జున్ తదితరులు స్వాగతం పలికారు. బెటాలియన్‌ను సందర్శించిన అనంతరం విజయరావు మీడియాతో మాట్లాడారు. గతంలో తాను విజయనగరంలో 5వ బెటాలియన్ కమాండెంట్‌గా కూడా పని చేశానని, ఆ అనుభవంతో సిబ్బంది మెరుగ్గా పని చేసేలా చూడడంతో పాటు వారి సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు.

23న గురుకుల ప్రవేశ పరీక్ష

పిఠాపురం: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 23న పరీక్ష నిర్వహించనున్నారు. అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ పీవీ త్రివేణి బుధవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఐదో తరగతికి ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ, ఇంటర్మీడియెట్‌కు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తారని వివరించారు. ఐదో తరగతికి ఏపీ జీపీసెట్ వెబ్‌సైట్, ఇంటర్మీడియెట్‌కు ఏపీజీపీసెట్.సీఎఫ్ఎస్ఎస్.ఇంటర్ వెబ్‌సైట్‌ల నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

నోటుకు నై.. పేమెంటుకు సై



- నగదు లావాదేవీలకు క్రమంగా చెల్లుచీటీ
- ఆన్‌లైన్ చెల్లింపులకు చిరు వ్యాపారులూ మొగ్గు
- విస్తృతంగా పేమెంట్ యాప్‌ల వాడకం
- భారీగా పెరిగిన నగదు రహిత లావాదేవీలు

మండపేట: బయటకు వెళుతున్నారా?.. జేబులో చిల్లిగవ్వ లేకపోయినా ఫర్వాలేదు.. అకౌంట్‌లో సొమ్ములు, చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. కావాల్సిన వస్తువులు కొనేయొచ్చు.. నచ్చిన ఫుడ్ తినేయొచ్చు.. మొన్నటి వరకూ మాల్స్, వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్స్ ఇప్పుడు చిరు వ్యాపారుల చెంతకు సైతం చేరాయి. నగదు లావాదేవీలు తగ్గుతుండగా.. ఎక్కడ చూసినా ఆన్‌లైన్ చెల్లింపులే కనిపిస్తున్నాయి.

ఆరేళ్ల క్రితం పెద్ద నోట్ల రద్దు తర్వాత డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రయత్నించినా అప్పట్లో పెద్దగా ప్రజలు ఆసక్తి చూపించేవారు కాదు. మాల్స్, పెద్ద పెద్ద వ్యాపార సంస్థల్లో మాత్రమే పేమెంట్ యాప్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులతో చెల్లింపులు కనిపించేవి. నగదు వేరే వారి ఖాతాల్లోకి వెళ్లిపోతుందన్న అపోహలు, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న ఆందోళనతో గ్రామాల్లో వీటి జాడ పెద్దగా కనిపించేది కాదు. కోవిడ్ అనంతర పరిణామాలతో నగదు రహిత లావాదేవీలతో గణనీయమైన మార్పులు వచ్చాయి.

అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులే..

ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, అమెజాన్ పే తదితర పేమెంట్ యాప్‌ల సేవలతో అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్ రీచార్జీలు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, ఇతర ఆర్థిక లావాదేవీలు చాలావరకూ ఈ యాప్‌ల ద్వారానే జరుగుతున్నాయి. పేమెంట్ యాప్‌లు వినియోగిస్తున్న వారిలో యువత ముందు వరుసలో ఉంటోందని ఆయా సంస్థల ప్రతినిధులు అంటున్నారు.



బటర్ మిల్క్ బండి వద్ద క్యూఆర్ కోడ్ స్టిక్కర్



బజ్జీల బండి వద్ద క్యూఆర్ కోడ్ స్టిక్కర్



జామకాయల వ్యాపారి వద్ద క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్స్

చిరు వ్యాపారుల చెంతకు..

టీ స్టాళ్లు, కాకా హోటళ్లు, తోపుడు బండ్లు, సైకిళ్లపై రోడ్ల పక్కన, ఇంటింటికీ తిరుగుతూ ఫాస్ట్‌ఫుడ్స్, కూరగాయలు, పండ్లు వంటివి అమ్మే వ్యాపారులకు ఆన్‌లైన్ చెల్లింపులు ప్రయోజనకరంగా మారాయి. ప్రధానంగా చిల్లర సమస్యతో వీరికి బేరాలు పోతూంటాయి. ఆన్‌లైన్ చెల్లింపుల పుణ్యమా అని చిల్లర సమస్య తీరుతూండటంతో చిరు వ్యాపారులు సైతం వీటి వైపు మొగ్గు చూపుతున్నారు. పేమెంట్ యాప్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసినా క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు, బోర్డులు దర్శనమిస్తున్నాయి.

స్పీకర్ బాక్స్‌లతో మోసాలకు చెక్

ఆన్‌లైన్ చెల్లింపుల్లో సౌలభ్యంతో పాటు ఆదమరిస్తే మోసాలకు అంతే ఆస్కారం ఉంటుందని నిపుణులు అంటున్నారు. వీటిపై అవగాహన లేని వారిని లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ మాయగాళ్లు మోసాలకు పాల్పడుతూంటారు. సరకులు కొనుగోలు చేసిన తర్వాత వేరే వారికి అమౌంట్ ట్రాన్స్‌ఫర్ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన ట్రాన్సాక్షన్ సక్సెస్‌ఫుల్ మెసేజ్‌ను దుకాణదారుకే అమౌంట్ పే చేసినట్టు చూపించి జారుకుంటారు. అయితే, ప్రస్తుతం కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్స్‌లు ఇటువంటి అక్రమాలకు చెక్ పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపు జరగగానే ఎంత అమౌంట్ దుకాణదారు అకౌంట్‌కు జమ అయ్యిందనే విషయం స్పీకర్‌లో బయటకు ఆడియో మెసేజ్ వస్తోంది. దీంతో సెల్‌ఫోన్ స్క్రీన్ మోసాలకు అడ్డుకట్ట పడుతోంది.

డిజిటల్ బ్యాంకింగ్‌కు ప్రాధాన్యం

బ్యాంకుల్లో కూడా డిజిటల్ బ్యాంకింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగదు లావాదేవీలు చాలావరకూ తగ్గిపోయాయి. ఇప్పటికే తూర్పు గోదావరి జిల్లాను నూరు శాతం డిజిటల్ జిల్లాగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుర్తించింది. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన జిల్లాలను కూడా డిజిటల్ జిల్లాలుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. విద్యార్థి దశ నుంచే బ్యాంకింగ్ కార్యకలాపాలపై అవగాహన కల్పించేందుకు పాఠశాలల సిలబస్‌లో ఆర్థిక సేవలను చేర్చే అంశాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలిస్తున్నట్టు ఆర్‌బీఐ అధికారులు చెబుతున్నారు.

చాలా వరకూ ఆన్‌లైన్ చెల్లింపులే..



మండపేట రైతు బజారులో రైతులందరికీ పేమెంట్ యాప్‌లున్నాయి. గతంతో పోలిస్తే ఆన్‌లైన్ చెల్లింపులు చాలా వరకూ పెరిగాయి. చిల్లర సమస్య కూడా ఉండటం లేదు.

– వాసు, కూరగాయల వ్యాపారి, మండపేట

డిజిటల్ బ్యాంకింగ్ సేవలు పెరిగాయి



ఇప్పుడు నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యం ఎక్కువగా ఉంది. వినియోగదారులు అధికంగా క్యాష్‌లెస్ ట్రాన్సాక్షన్లు చేస్తున్నారు. ఇంటి వద్ద నుంచే అన్ని రకాల సేవలూ పొందుతున్నారు. దీని వలన బ్యాంకుకు వచ్చే వారి సంఖ్య గతంతో పోలిస్తే బాగా తగ్గింది. ఆన్‌లైన్ బ్యాంకింగ్ వలన ఖాతాదారులకు భద్రత ఎక్కువగా ఉంటుంది.

– రొక్కం రవికుమార్, బ్రాంచి మేనేజర్, ఎస్‌బీఐ, రాయవరం శాఖ

గడువులోపు 'పది' పరీక్షల మూల్యాంకనం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్జేడీ నాగమణి

అమలాపురం టౌన్: పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్) గడువులోగా అంటే ఈ నెల 26వ తేదీలోపు పూర్తి చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కేంద్రం అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19 నుంచి 26వ వరకూ జరగనున్న పదో తరగతి పరీక్షల మూల్యాంకనం విధులకు నియమితులైన అసిస్టెంట్ ఎగ్జామినర్స్, చీఫ్ ఎగ్జామినర్స్, స్పెషల్ అసిస్టెంట్లతో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఇతర జిల్లాలకు చెందిన 1.75 లక్షల పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం అమలాపురంలో జరుగనుందని నాగమణి వివరించారు. 600 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్స్, 140 మంది చీఫ్ ఎగ్జామినర్స్, 250 మంది స్పెషల్ అసిస్టెంట్లు ఈ మూల్యాంకనంలో విధులు నిర్వర్తించనున్నారని వెల్లడించారు. డీఈవో ఎం.కమలకుమారి మాట్లాడుతూ మూల్యాంకనానికి నియమితులైన సిబ్బంది అప్రమత్తంగా జవాబు పత్రాలను దిద్దాలని సూచించారు. అనంతరం మూల్యాంకన ప్రక్రియను ఆర్జేడీ నాగమణి, డీఈవో కమలకుమారి ప్రారంభించారు. ఈ మూల్యాంకనాన్ని అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్ బి.రమణశ్రీ, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్ షాలంరాజు పర్యవేక్షిస్తున్నారు. జిల్లా సర్వశిక్ష అభియాన్ సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏపీవోలు ఎంఏకే భీమారావు, పిల్లి రాంబాబు పాల్గొన్నారు.

గ్రామ మహిళా పోలీసులు కీలకం



ఎస్పీ శ్రీధర్‌కు అభినందనలు తెలుపుతున్న మహిళా పోలీసులు. చిత్రంలో ఏఎస్పీ లతా మాధురి

అమలాపురం టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవలు అందించడంలో గ్రామ మహిళా పోలీసుల పాత్రే కీలకమని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ అన్నారు. జిల్లా మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా పోలీసుల బృందం బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శ్రీధర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ మహిళా పోలీసులకు పోలీసుశాఖలో ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతీ గ్రామంలో ఉండే సచివాలయానికో మహిళా పోలీసును నియమించిన ఘనత ఈ రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. మహిళలు, చిన్నారుల రక్షణే ధ్యేయంగా మహిళా పోలీసు వ్యవస్థ పనిచేస్తోందన్నారు. జిల్లా ఏఎస్పీ కె.లతామాధురితో కలిసి మహిళా పోలీసుల బృందం ఎస్పీని కలిసింది. జిల్లా అసోసియేషన్ అధ్యక్షురాలు కె.వెంకట ధనలక్ష్మి, రాష్ట్ర అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పీఎన్ ప్రియ, జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు కేపీఎస్ఎన్ గనికమ్మ, జిల్లా అదనపు కార్యదర్శి టి.రాజేశ్వరి ఎస్పీని కలిశారు.

మహనీయులకు కులాన్ని ఆపాదించకండి

- యూటీఎఫ్ జిల్లా సభలో నేతల ఉద్ఘాటన
- జ్యోతిరావ్ ఫూలే, అంబేడ్కర్‌లకు నివాళి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సాబ్జి

కపిలేశ్వరపురం: మానవ సమాజ ప్రగతికి అడ్డుగా ఉన్న కులం, మతం, ప్రాంతీయ భావనలను తుంగలోకి తొక్కే లక్ష్యంతో సంఘాన్ని సంస్కరించిన జ్యోతిరావ్ ఫూలే, అంబేడ్కర్‌లకు కులాన్ని ఆపాదిస్తూ కుల నాయకులుగా చూడొద్దని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అంగరలో ఫూలే, అంబేడ్కర్ జయంతి ఉత్సవాల ముగింపు సభలో వెంకటేశ్వర్లు, పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ప్రసంగించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫూలే, అంబేడ్కర్‌లు వ్యక్తి ఆరాధనకు, కుల వ్యవస్థకూ వ్యతిరేకమని, కుల నిర్మూలన కోసం తమ జీవితాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. వారినీ, వారి సిద్ధాంతాలనూ ఆచరించడమే ఘనమైన నివాళి అన్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేని కుల వ్యవస్థ కేవలం భారతదేశంలో మాత్రమే ఉందన్నారు. 80 శాతంగా ఉన్న దళిత, బలహీన వర్గాల చేతిలో సంపద లేకపోవడానికి కుల వ్యవస్థ ప్రధాన కారణమన్నారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మాట్లాడుతూ ప్రతి మానవుడు విశ్వమానవుడిగా వికసించేలా ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. హక్కులు కోసం పోరాడుతున్న తీరుగానే విద్యార్థులను మంచి సామాజిక కార్యకర్తలుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రపంచమంతా శాస్త్ర సాంకేతిక రంగంలో ముందుకు దూసుకుపోతుండగా కేంద్ర ప్రభుత్వం ఛాందస భావాలను వ్యాప్తి చేసే దిశగా నడుస్తోందన్నారు. ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు యూటీఎఫ్ నిరంతరం పోరాడుతుందని, ప్రభుత్వ బడులు రద్దయితే భవిష్యత్తులో విద్య పేదలకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. సంపదను సృష్టించే సాధనాలు సామాన్య ప్రజల చేతికి దక్కే వరకూ యూటీఎఫ్ బాధ్యతగా పోరాడుతుందన్నారు. కరోనా సమయంలో ఐసోలేషన్ కేంద్రాలను నిర్వహించి ప్రజల ప్రాణాలను కాపాడిన సంఘం టీచర్లను అభినందించారు. తొలుత ఫూలే, అంబేడ్కర్‌ల చిత్రపటాల వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి డీవీ రాఘవులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా అసోసియేట్ సభ్యుడు పి.సురేంద్ర, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జువ్వల శ్రీనివాస్, ఇల్లూరు సూరిబాబు మాట్లాడారు.

మంత్రి విశ్వరూప్ ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: పట్టణ ముస్లింలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ స్థానిక షాదీ ఖానాలో బుధవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. మంత్రి, ఆయన తనయుడు డాక్టర్ శ్రీకాంత్ స్వయంగా విందులో వడ్డించారు. ముస్లింలు సేవా కార్యక్రమాలు చేపట్టడంతో ముందు ఉంటున్నారని మంత్రి విశ్వరూప్ అన్నారు. ఈ విందులో మంత్రి విశ్వరూప్‌తోపాటు ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, రాష్ట్ర దృశ్య కళల అకాడమి చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ప్రముఖులు పాల్గొన్నారు. ముస్లిం గురువులు నమాజ్ చేశారు. పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, రాష్ట్ర కరికాల భక్తుల కార్పొరేషన్ డైరెక్టర్ కరెళ్ల రమేష్‌బాబు, పార్టీ నాయకులు వంటిద్దు వెంకన్నాయుడు, ముసలి స్వర్ణరాజ పాల్గొన్నారు.

పొగాకు సాగులో యాంత్రీకరణకు ప్రాధాన్యం



క్యూఆర్‌టీ చైర్మన్ డాక్టర్ సందును సత్కరిస్తున్న సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పొగాకు సాగులో యాంత్రీకరణకు చాలా ప్రాధాన్యం ఇవ్వాలని క్విన్‌క్వెన్నియల్ రివ్యూ టీమ్ (క్యూఆర్‌టీ) చైర్మన్ డాక్టర్ జీఎస్ సందు సూచించారు. స్థానిక కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ(ఐసీఏఆర్ – సీటీఆర్ఐ)లో శాస్త్రవేత్తలతో కూడిన క్యూఆర్‌టీ బృందం సమీక్ష మూడో రోజైన బుధవారం ముగిసింది. సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు, పొగాకు బోర్డు, ఐటీసీ అధికారులు, పొగాకు రైతులు, వర్తక రంగ సభ్యులతో క్యూఆర్‌టీ బృందం ముఖాముఖి నిర్వహించింది. ఈ సందర్భంగా డాక్టర్ సందు మాట్లాడుతూ, వినూత్న మార్పులతో సాగు ఖర్చు తగ్గించుకుని, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేలా దిశానిర్దేశం చేసుకోవాలని సూచించారు. ఆకుల రంగును బట్టి యాంత్రీకరణ ద్వారా గ్రేడులు నిర్ణయించే దిశగా పరిశోధనలు చేయాలని అన్నారు. ఆకులను తుంచడం, బర్లీ విధానాల్లో యంత్రాల వినియోగంపై అధ్యయనం చేయాలని చెప్పారు. ఉత్తరాంధ్ర తేలిక నేలల పొగాకు రైతులు జి.శేషగిరిరావు, ఎ.గోపాలకృష్ణ, పి.వెంకటరావు, మధు, వాసుదేవరావు, వివేకానందలు పొగాకు సాగులో లాభనష్టాలను, సాగు వివరాలను తెలిపారు. కొత్త వంగడాలు అందించాలని కోరారు. అనంతరం క్యూఆర్‌టీ బృందాన్ని సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ సత్కరించారు. సమావేశంలో ఐటీసీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ పి.శ్రీనివాస్, జీపీఐ జనరల్ మేనేజర్ ఎం.ప్రభాకరరావు, టుబాకో బోర్డు రీజినల్ మేనేజర్ ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యలోనూ పేదలకు ఉచితం

- విద్యాహక్కు చట్టం అమల్లో భాగంగా ఒకటో తరగతిలో ప్రవేశాలు
- మొదటి విడత జాబితా విడుదల చేసిన ప్రభుత్వం



రాయవరం: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1)(సి) ప్రకారం ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇవ్వాల్సి ఉంది. గతంలోనే చట్టం ఉన్నప్పటికీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దీన్ని కచ్చితంగా అమలు చేస్తోంది. గత విద్యా సంవత్సరంలో కూడా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ చట్టాన్ని అమలు చేసి 570 మంది విద్యార్థులకు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు కల్పించారు. వచ్చే విద్యా సంవత్సరానికి ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే నోటిఫికేషన్ విడుదల చేసి, మొదటి విడత జాబితాను కూడా విడుదల చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,520 మందికి ఒకటో తరగతిలో ప్రవేశానికి అవకాశం కల్పించారు.

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇదీ..

తూర్పుగోదావరి జిల్లాలో 450, కాకినాడ జిల్లాలో 445, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 343 ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలు సీఎస్ఈ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నాయి. ఐబీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ/స్టేట్ సిలబస్‌లు అమలవుతున్న ఈ స్కూళ్లలో 25శాతం సీట్లు ఒకటో తరగతి విద్యార్థులకు కేటాయించాల్సి ఉంది.

25లోగా చేర్చుకోవాలి

మార్చి నెలలో ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం తల్లిదండ్రులు దరఖాస్తు చేశారు. అర్హులైన వారిని ఎంపిక చేసి, మొదటి విడత జాబితాను విడుదల చేశారు. మండలాల వారీగా ఎంపికైన జాబితాలో విద్యార్థి దరఖాస్తు ఐడీ, వారు ఏ సచివాలయం పరిధిలో ఉన్నారు, వారిని ఏ ఏ పాఠశాలలకు కేటాయించిందీ పేర్కొన్నారు. ఆ ప్రకారం సంబంధిత విద్యార్థులు ఆయా పాఠశాలలు చేర్చుకునే విధంగా జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణ చేయాల్సి ఉంది. కాకినాడ జిల్లాలో 549, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 555, తూర్పుగోదావరి జిల్లాలో 416 మంది ఒకటో తరగతిలో చేరేందుకు మొదటి జాబితాను విడుదల చేశారు.

అవగాహన కల్పించాం



ఇప్పటికే ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలకు చట్టంపై అవగాహన కల్పించాం. జాబితాలో ఉన్నవారికి ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించాల్సి ఉంది.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

క్లుప్తంగా

పీఎఫ్ ఖాతాలు నేరుగా చూసుకొనే అవకాశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ వివరాలను నేరుగా ఎవరికి వారే తెలుసుకునే విధంగా వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు సంబంధించి 2022–23 ఆర్థిక సంవత్సరం పీఎఫ్ స్లిప్పులు విడుదల చేసిన సందర్భంగా మాట్లాడారు. తాను ఉమ్మడి జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్‌గా ఉండగానే 2010లో సీనియర్ అసిస్టెంట్ ఏవీఎస్ చంద్రశేఖర్‌తో ఈ వెబ్ అప్లికేషన్ తయారు చేయించినట్లు మంత్రి వేణు తెలిపారు. దీని కారణంగా చందాదారులు ఎప్పుడు అవసరమైతే అప్పుడు తన పీఎఫ్ ఖాతాలో నిల్వ ఉన్న సొమ్మును తెలుసుకోవచ్చన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లాలోనే మొట్టమొదటి సారిగా పీఎఫ్ ఖాతాలను ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు. చందాదారుల ఫోన్ నంబర్‌కు ఎస్ఎంఎస్ సందేశం వెళ్లేలా వెబ్ అప్లికేషన్ అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ విషయంలో చొరవ తీసుకున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, సీఈవో ఎస్‌వీవీ సత్యనారాయణను మంత్రి అభినందించారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఈవో ఎ.రమణారెడ్డి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్, పీఎఫ్ విభాగాపు పరిపాలనాధికారులు కె.నరేంద్రరెడ్డి, ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే వాలీబాల్ అసోసియేషన్ ఎన్నికలు

అమలాపురం టౌన్: ఏపీ ఒలింపిక్ అసోసియేషన్, ఏపీ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ నిబంధనలు, మార్గ దర్శకాలతోనే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరిగాయని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.రామరాజు పేర్కొన్నారు. ఈ మేరకు అమలాపురంలో బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, సాప్, వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర పరిశీలకుల సమక్షంలో ఈ నెల 16న రాజమహేంద్రవరంలో ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు. గత జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు కొందరు తమ ఎన్నిక చెల్లందంటూ చేసిన ప్రకటనను రామరాజు ఖండించారు. గత అసోసియేషన్ పదవీ కాల సమయంలో రూ.3 లక్షల నిధులు దుర్వినియోగం జరిగాయని, అప్పట్లో దీనిపై తాము ఏపీ వాలీబాల్ అసోసియేషన్‌కు ఫిర్యాదు కూడా చేశామని గుర్తు చేశారు. 15 రోజుల్లో ఆ నిధులకు సంబంధించి బాధ్యులు కొత్తగా ఏర్పడ్డ తమ జిల్లా అసోసియేషన్‌కు సమాధానం చెప్పాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలకు వెళతామని జిల్లా అధ్యక్షుడు రామరాజు తెలిపారు.

రైతుల ప్రగతికి కృషి



సమావేశంలో పాల్గొన్న మంత్రులు దాడిశెట్టి రాజా, వేణుగోపాలకృష్ణ, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలకృష్ణ, విప్ చిర్ల జగ్గిరెడ్డి, కలెక్టర్ కృతికా శుక్లా



సమావేశంలో పాల్గొన ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, అనంతబాబు, ఎమ్మెల్యేలు ధనలక్ష్మి, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, రాజ్యసభ సభ్యుడు పిల్లి బోస్, జెడ్పీటీసీ సభ్యులు

- విత్తు నుంచి విక్రయం వరకు ప్రతి దశలోనూ ప్రభుత్వ అండ
- జిల్లా పరిషత్ సమావేశంలో మంత్రి వేణుగోపాలకృష్ణ

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రైతుల సంక్షేమానికి, వ్యవసాయ రంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం కాకినాడ జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ చైర్‌పర్సన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మంత్రి వేణు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విత్తు నుంచి విక్రయం వరకు ప్రతి దశలోనూ రైతులకు అండగా ఉంటోందన్నారు. రబీ పంటకు సాగునీటి పరంగా కొంత ఇబ్బంది ఎదురైనా ప్రభుత్వం తక్షణం స్పందించి ఏలేరు నుంచి అదనపు నీటిని తీసుకొని ఎక్కడా సమస్య అనేది లేకుండా చేసిందని వివరించారు. దీంతో రెండో పంట విజయవంతంగా ముగుస్తున్నట్లు తెలిపారు. గతేడాది జూన్ 1కే ఖరీఫ్ నీరు విడదల చేయడంతో ముందే పంట వేయడం వల్ల తుపాన్లకు దొరక్కుండా చూడగలిగామన్నారు. రబీ వరికి సంబంధించి జరిగిన పంట కోత ప్రయోగాలను బట్టి చూస్తే మంచి దిగుబడులు నమోదయ్యాయని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తోందని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తి స్థాయిలో నింపుతున్నట్లు వివరించారు. ప్రజలకు తాగునీటి పరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని మంత్రి వేణుగోపాలకృష్ణ సూచించారు. రబీ సీజన్‌కు సంబంధించి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని లక్ష్యాలకు అనుగుణంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా బొండాలు రకం ధాన్యం కూడా కొనుగోలు చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. అవసరం మేరకు లక్ష్యాలను పెంచేందుకు కృషి చేయనున్నట్లు మంత్రి వేణుగోపాలకృష్ణ వివరించారు.

క్షణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకుంటాం: కలెక్టర్ కృతికా శుక్లా

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ తెలిపారు. లక్ష్యాల మేరకు ఆర్బీకేల ద్వారా మద్దతు ధరకు బొండాలు రకం ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. కాలువల మూసివేత అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వేసవిలో తాగు నీటి సరఫరాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రబీకి సాగునీటి పరంగా ఒత్తిడి ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించి నిరంతర పర్యవేక్షణతో సమస్య లేకుండా చేశామన్నారు. పూర్తి ఆయకట్టుకు నీరు అందించగలిగామని కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు. వ్యవసాయశాఖ అధికారులు మాట్లాడుతూ రబీ పంట కోతలు పూర్తయిన వెంటనే అపరాలు లేదా పచ్చిరొట్ట సాగు చేసేందుకు మినుములు, పెసర, పిల్లిపెసర, జనుము తదితర విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లు, పచ్చిరొట్ట సాగు, వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో అమలవుతున్న పథకాలు, వేసవిలో తాగునీటి సరఫరా ప్రణాళిక తదితర అజెండా అంశాలపై సమావేశంలో చర్చించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్యేలు సత్తి సూర్యనారాయణరెడ్డి, జ్యోతుల చంటిబాబు, జక్కంపూడి రాజా, నాగులాపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, చిక్కాల రామచంద్రరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, అనంత ఉదయ భాస్కర్, బొమ్మి ఇజ్రాయేల్, జెడ్పీ సీఈవో ఎస్‌వీవీ సత్యనారాయణ, జెడ్పీ పరిపాలనాధికారి ఎం. బుజ్జిబాబు, జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యా, వైద్యరంగాలకు అత్యంత ప్రాధాన్యం

– మంత్రి దాడిశెట్టి రాజా

ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖమంత్రి దాడిశెట్టి రాజా పేర్కొన్నారు. విప్లవాత్మక వ్యవస్థలతో ప్రజలకు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ పథకాలు, కార్యక్రమాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పరిషత్ సమావేశాలు మంచి చర్చకు వేదికలుగా నిలుస్తున్నాయని, జెడ్పీటీసీ సభ్యులు ఆయా ప్రాంతాల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

– జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలకృష్ణ

గతంలో ఎన్నడూ లేని విధంగా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన చారిత్రాత్మక ఆలోచన మేరకు గత ఖరీఫ సీజన్‌కు జూన్ 1 నుంచి నీరు ఇచ్చామన్నారు. నవంబర్‌లో భారీ వర్షాలు, వరదల కారణంగా రైతులకు నష్టం వాటిల్లకుండా చూసేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రబీకి సాగునీటి ఎద్దడి లేకుండా సీలేరు నుంచి అదనపు నీటిని తీసుకొని పూర్తి ఆయకట్టుకు నీరు ఇచ్చామన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తూ తీర్మానం ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి





విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న సాక్షి సంపాదకులు మురళి, విద్యార్థులు చేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

- సాక్షి సంపాదకులు వర్ధెల్లి మురళి
- శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో ఉత్సాహంగా 'కేరింతలు 2023'

నక్కపల్లి/ పాయకరావుపేట : తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సాక్షి దినపత్రిక సంపాదకులు వర్ధెల్లి మురళి అన్నారు. బుధవారం ఆయన పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో కేరింతలు 2023 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రవైభవం పేరుతో తెలుగు జాతి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే ప్రయత్నంలో భాగంగా శ్రీప్రకాష్ విద్యాసంస్థ కేరింతలు కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలుగు జాతికి సంబంధించి సాహిత్యం, ఆటపాటలు, కళారూపాలు, నడవడిక నియంత్రించే సంప్రదాయాలు, కట్టుబాట్లు ఎన్నో ఉన్నాయని, జానపద కళారూపాలు, నృత్యాలు, భాష, వ్యాకరణం వంటి ఎన్నో అంశాలున్నాయని, ఇవన్నీ తెలుగుజాతి వారసత్వ సంపద అని పేర్కొన్నారు. వీటిని ప్రత్యేక శ్రద్ధ పెట్టి రక్షించుకోవాల్సిన పరిస్థితులు నేడు ఏర్పడ్డాయన్నారు. వైతాళికులు, కవులు, మన సంస్కృతిని నిలబెట్టుకోవాలని ముందుకు వచ్చిన సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. తెలుగు జాతి ఎన్నో రంగాల్లో వెనుకబడి ఉందని, తెలుగుతల్లి కాపాడుకో అంటూ జంధ్యాల పాపయ్యశాస్త్రి రాసిన కావ్యాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. వైతాళికుల పాత్రలను పోషించడానికి ఇటువంటి విద్యాసంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కొన్ని సవాళ్లు మనకు ఎదురవుతున్నాయన్నారు. పిల్లల్ని బడికి పంపే సమయంలో ఎన్నో ఆశలు పెట్టుకుంటున్నామన్నారు. నేడు సంస్కృతి మీద దాడి చేసే పరిణామాలు చాలా ఉన్నాయని, దీనిలో ముఖ్యంగా పిల్లలపై మొబైల్ ఫోన్‌ల ప్రభావం చాలా ఉందన్నారు. దీని ప్రభావం మంచి కంటే చెడు ఎక్కువగా వ్యాపిస్తోందన్నారు. పిల్లలకు ఫోన్‌లకు బదులు డెస్క్ టాప్‌లు, చెత్త యాప్‌లు లేని ట్యాబ్‌లు ఇవ్వాలన్నారు. 18 ఏళ్ల వచ్చే వరకు పిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వొద్దని ఈ సందర్భంగా తల్లిదండ్రులకు మనవి చేస్తున్నానన్నారు. చారిత్రక ప్రదేశాల వద్దకు వెళ్లిన సమయంలో కూడా వాటి చరిత్ర తెలుసుకోవడం కంటే ఆండ్రాయిడ్ ఫోన్ మోజులో పడి ఫొటోలు తీసుకోడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఆటపాటలు, బంధువులతో అనుబంధాలను వదిలేస్తున్నారు కాబట్టి పిల్లలను మొబైల్‌ఫోన్‌ల నుంచి దూరంగా ఉంచాలన్నారు. మరో అతిథి దక్కన్ ఫైన్ కెమికల్స్ వైస్‌ప్రెసిడెంట్ ఆనందరావు మాట్లాడుతూ మనం పాటించే సంప్రదాయాలు ఆహార అలవాట్లలో కూడా సైంటిఫిక్ రీజన్ ఉందన్నారు. కింద కూర్చొని ఆహారం తినడం వల్ల మంచి ఎక్సర్‌సైజ్ ఉంటుందన్నారు. చేత్తో భోజనం చేయడం వల్ల పంచతత్వాలు లభిస్తాయన్నారు. డబ్బుంటేనే ఐశ్వర్యవంతుడు కాదన్నారు. మంచి నడవడిక, ఆరోగ్యం, మంచి బుద్ధులు కలిగిన సంతానం కలిగి ఉన్నవాడే నిజమైన ఐశ్వర్యవంతుడన్నారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాన్ని కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే తమ విద్యాసంస్థలో ఒకటినుంచి 5వ తరగతి చదువుతున్న సుమారు 800 మంది విద్యార్థులతో ఆంధ్ర వైభవాన్ని చాటిచెప్పే విధంగా తెలుగు జాతి ఔన్నత్యాన్ని సంప్రదాయాన్ని నాటక పద్య, గేయ, నృత్య రూపంలో ప్రదర్శన ద్వారా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అత్యంత ప్రతిభ కనపరచిన విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నర్సింహరావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్ మూర్తి ప్రోగ్రాం కన్వీనరు వి.ఎం.ఎస్ రత్నం, కో కన్వీనర్లు ప్రసూనా మౌళి, సంధ్యారాణి, డీఎల్‌పీ రాజు, ఉషారాణి, పీఆర్‌వో పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూలి పనులకు వెళ్లి బలి



సామర్లకోటలో కూలిన చర్చి గోడ



ఆస్పత్రి వద్ద వివరాలు సేకరిస్తున్న దొరబాబు





పిట్టా అర్జునరావు, మచ్చా నాగేశ్వరరావు (పాత చిత్రాలు)



విషణ్ణ వదనాలతో మృతుల బంధువులు

- చర్చి పునర్నిర్మాణ పనులలో అపశృతి
- గోడ కూలి ముగ్గురికి తీవ్ర గాయాలు
- చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

సామర్లకోట: కూలి పనికి వెళ్లిన ముగ్గురు ప్రమాదంలో చిక్కుకొనగా ఇద్దరు చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం స్థానిక బలుసులపేటలోని పురాతన ప్రేయర్ ఆఫ్ చర్చి గోడలు కూల్చి వేయడానికి అదే ప్రాంతానికి చెందిన కూలీలు వెళ్లారు. కూల్చుతున్న సమయంలో ఒక్కసారిగా గోడ కూలి పోవడంతో శిథిలాల కింద ముగ్గురు కూలీలు యడగళ్ల అబ్రహం, పిట్టా అర్జునరావు (35), మచ్చా నాగేశ్వరరావు (35) చిక్కుకున్నారు. ఇళ్ల మధ్యనే చర్చి ఉండటంతో బాధితుల కేకలకు స్థానికులు వచ్చి శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీశారు. శిథిలాలు మీద పడటంతో తలకు, కాళ్లకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పిట్టా అర్జునరావు, మచ్చా నాగేశ్వరరావు మృతి చెందారు. మృతుల కుటుంబాలను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప పరామర్శించారు. చర్చి నిర్వాహకులపై చర్యలు తీసుకొని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పురాతన చర్చిని భూస్థాపితం చేయకుండా పిల్లర్స్ వేసి చర్చి నిర్మిస్తున్న సమయంలోనే గోడలు కూలి పోయాయని ఆ ప్రాంత దళిత నాయకుడు నేతల శ్రీను ఆరోపించారు. చర్చి యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విషాదంలో బలుసులపేట

కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందిన వార్త తెలిసి బలుసులపేటలో విషాదం అలముకుంది. మచ్చా నాగేశ్వరరావుకు భార్య మల్లేశ్వరి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తె 10వ తరగతి పరీక్షలు రాయగా, మరో కుమార్తె 8వ తరగతి చదువుతోంది. పిట్టా అర్జునరావుకు భార్య నూకరత్నం, నాలుగో తరగతి చదువుతున్న కుమారుడు, ఒకటో తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు. కుటుంబాన్ని పోషించేవారు చనిపోవడంతో కుటుంబ సభ్యులు తమ ఆధారాన్ని కోల్పోయామని విలపిస్తున్నారు. తమ పిల్లలను ఎవరు ఆదుకొంటారని నూకరత్నం, మల్లేశ్వరి బోరున విలపించారు. కుటుంబ సభ్యులు కాకినాడ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు.

ద్వారపూడిలో నకిలీ వైద్యుల మెడికల్ క్యాంపు!



నిర్వాహకులతో మాట్లాడుతున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, పంచాయతీ సిబ్బంది

మండపేట: మండలంలోని ద్వారపూడిలో నకిలీ వైద్యబృందం మెడికల్ క్యాంపు నిర్వహించడంపై మండల వైద్యాధికారి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించి మందులు అందజేస్తామని ఒక హెర్బల్ ప్రైవేట్ ఏజెన్సీ పంచాయతీ సిబ్బందిని కోరగా అందుకు వారు అనుమతించారు. బుధవారం నిర్వాహకులు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఫుల్ బాడీ హెల్త్ చెకప్‌కు రూ.2,000 ఖర్చవుతుండగా తాము ఉచితంగా చేస్తామని ప్రచారం చేశారు. వైద్య పరీక్షల కోసం స్థానికులు రాగా పరీక్షల అనంతరం ఒక్కొక్కరికి రూ.2,000 నుంచి రూ.3,000 విలువైన మందులు రాసి అమ్మకాలు ప్రారంభించారు. ఉచిత మెడికల్ క్యాంపు పేరిట మందుల అమ్మకాలు చేస్తుండటంపై పంచాయతీ సిబ్బందికి అనుమానం వచ్చి మండల వైద్యాధికారి ఎస్.సూర్యనారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన పంచాయతీకి చేరుకుని వారిని ఆరా తీశారు. తాము అన్ని అనుమతులతోనే క్యాంపు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కాగా క్యాంపు నిర్వహిస్తున్న వారిలో క్వాలిఫైడ్ వైద్యులు, వైద్య సిబ్బంది లేరని ఆయన గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు జరిపి, మందులు విక్రయిస్తుండటంపై డాక్టర్ సూర్యనారాయణరెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారి లైసెన్సులను పోలీసులు పరిశీలిస్తున్నారు. వాటి ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

- యువకుల మృతి ఘటనపై పోలీసుల నిర్ణయం
- శాంతించిన ఆందోళనకారులు



ఆందోళనకారులతో చర్చలు జరుపుతున్న కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి

కాజులూరు: గొల్లపాలెంలో బయోడీజిల్ ట్యాంక్‌లో పడి ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎస్.తులసీరామ్ బుధవారం తెలిపారు. ఆర్యావటంకు చెందిన తాతపూడి మహేష్ (25), శీలకు చెందిన నెరేడుమిల్లి శివకుమార్ (25) స్థానిక కాజులూరు రోడ్డులోగల మూతపడిన బంక్ బయో డీజిల్ ట్యాంకులోకి దిగి ఊపిరి ఆడక మంగళవారం మృతిచెందారు. యువకులు బంక్ పక్కనే ఉన్న షాపులో మద్యం సేవించి డీజిల్ కోసం ట్యాంకులోనికి దిగారనిచ ఎండ తీవ్రతకు డీజిల్ వేడెక్కి గ్యాస్ ఏర్పడి యువకులు ఊపిరాడక చనిపోయారని కొందరు చెబుతున్నారు. మృతుల శరీరంపై గాయాలను బట్టి ఇది ప్రమాదవశాత్తూ జరిగిన ఘటన కాదని ఎవరో వీరిని హత్యచేసి డీజిల్ ట్యాంకులో పడవేశారని బంధువులు ఆందోళన చేపట్టారు. జిల్లా కేంద్రం నుంచి మాలమహానాడు, మాదిగ ఐక్యవేదిక సంఘం సభ్యులు వచ్చి ఘటనా స్థలం వద్దే ధర్నా నిర్వహించారు. కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, గొల్లపాలెం ఎస్సై ఎస్.తులసీరామ్, తహసీల్దారు బి.సాయిసత్యనారాయణ ఆందోళనకారులతో చర్చలు జరిపారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి వచ్చి ఆందోళనకారులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. తెల్లవారుజామున రెండు గంటల వరకూ ధర్నా కొనసాగింది. చివరకూ మృతుల తల్లితండ్రుల ఫిర్యాదుల మేరకూ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసేందుకు పోలీసులు అంగీకరించటంతో ఆందోళనకారులు శాంతించారు. మృత దేహాలను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉమ్మడి జిల్లాకు నూతన న్యాయమూర్తులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): బదిలీల్లో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు నూతన న్యాయమూర్తులు రానున్నారు. ఈ మేరకు హైకోర్టు గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా షేక్ జానీబాషా రానున్నారు. కాకినాడ మూడో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా ఎస్.రమేష్‌నాయుడు, కాకినాడ ఒకటో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా కె.వెంకటేశ్వరరావు రానున్నారు. పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న వై.బెన్నయ్యనాయుడు గుంటూరు జిల్లా తెనాలి సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. కాకినాడ మూడో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన టి.మల్లేశ్వరి కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. కొత్తపేట సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన ఎం.శ్రీధర్ గుంటూరు సీనియర్ సివిల్ జడ్జిగా, రాజమహేంద్రవరం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన వేపుల భవానీ విజయవాడ ఆరో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా, కాకినాడ ఒకటో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన వై.గోపాలకృష్ణ గుంటూరు బదిలీ అయ్యారు.

తప్పిన పెను ప్రమాదం

విద్యుత్ లైన్‌మన్, కార్మికుడికి తీవ్ర గాయాలు



విద్యుత్ ప్రమాదానికి గురై తీగలపై వేలాడుతున్న లైన్‌మన్ సింహాద్రి, శంకర్

రాజోలు: విద్యుత్ మరమ్మతు పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కరెంట్ ప్రవహించడంతో రాజోలు విద్యుత్ లైన్‌మన్ సింహాద్రి, ప్రైవేటు కార్మికుడు శంకర్ తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం రాజోలు ప్రభుత్వాస్పత్రి మెయిన్ గేటు వద్ద ఉన్న విద్యుత్ స్తంభంపై జరిగిన ఈ ప్రమాదంలో విద్యుత్‌షాక్‌కు గురైన సింహాద్రి, శంకర్ విద్యుత్ స్తంభంపై తీగలకు కొన ఊపిరితో వేలాడారు. స్థానికులు హుటాహుటిన ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఇతర గ్రామాలకు చెందిన లైన్‌మన్లు, ఫైర్‌సిబ్బంది, స్థానిక యువకులు వారిని విద్యుత్ వైర్ల నుంచి కిందకు దింపి వెంటనే పక్కనే ఉన్న ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి వారిని అమలాపురంలోని ఆస్పత్రికి తరలించారు. వారు పూర్తిగా కోలుకున్నారని, ప్రాణ భయం లేదని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.